సాక్షి
నిర్మల్

గురువారం । 24 । ఆగస్టు । 2023



**సృజనాత్మకతకు ఇన్‌స్పైర్ మానక్**
సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇన్‌స్పైర్ మానక్ దోహదం చేస్తుంది. ఇందులో విద్యార్థి ప్రాజెక్ట్ ఎంపికైతే ప్రభుత్వం రూ.10వేలు అందిస్తోంది. 10లో▸



**వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..**
వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ధీమా వ్యక్తంజేశారు. కాంగ్రెస్‌లో చేరిన నాయకులను పార్టీలోకి ఆహ్వానించారు. 11లో▸

గరిష్టం/కనిష్టం
31.0 /24.0

**వాతావరణం**
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది.

# జయహో.. ఇస్రో

- ఉద్విగ్నం.. మహోజ్వల క్షణం
- చంద్రయాన్–3 సక్సెస్‌పై హర్షం
- డిజిటల్ తెరలపై చూసిన జనం
- మార్మోగిన 'జయహో' నినాదం



చంద్రయాన్–3 చంద్రుడిపై ల్యాండ్ అయ్యే దృశ్యాన్ని నిర్మల్‌లో డిజిటల్ తెరపై వీక్షిస్తున్న విద్యార్థులు, చిన్నారులు

నిర్మల్‌ఖిల్లా: తీవ్ర ఉత్కంఠ మధ్య ఎప్పుడెప్పుడా.. అని ఎదురుచూస్తున్న క్షణాలు రానే వచ్చాయి. భారతదేశం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్–3 ఇప్పటివరకు అన్ని దశలను సవ్యంగా దాటుకుని చంద్రుడి దక్షిణ ధ్రువంపై సజావుగా ల్యాండ్ అయింది. అత్యంత సంక్లిష్టమైన ఈ ప్రక్రియను వీక్షించడానికి ప్రత్యక్ష ప్రసారంలో విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, జిల్లాలోని సకల ప్రజానీకం ఉద్విగ్నభరితమైన ఆసక్తి కనబరిచారు. దాదాపు గంటకు 6వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణించి చంద్రుడి కక్ష్యలోకి చేరుకున్న చంద్రయాన్–3 వ్యోమనౌకలోని విక్రమ్ ల్యాండర్ చందమామ దక్షిణ ధ్రువంపై సురక్షితంగా దిగింది. విక్రమ్ ల్యాండర్ కృత్రిమ మేధ సహాయంతో ఏర్పర్చిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్, శాస్త్రవేత్తల నేవిగేషన్ గైడెన్స్ అన్ని సమన్వయ పూరితంగా సమకూరి వాటి వేగదిశలను అనుక్షణం మార్చుకుంటూ చంద్రుడిని సునాయసంగా ముద్దాడింది. జిల్లా ప్రజానీకం వేయికళ్లతో అన్ని పనులు పక్కనపెట్టి ఎలక్ట్రానిక్ డిజిటల్ తెరలకు అతుక్కుని విక్రమ పరాక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. నింగి నుంచి విజయ గీతిక వెలువడిన మరుక్షణం జిల్లా మొత్తం కరతాళ ధ్వనులతో మార్మోగింది. ఈ మహోన్నత ఘట్టానికి అన్ని పాఠశాలలు, కళాశాలలు, గురుకులాలు, నివాసగృహాలు, వాణిజ్య సముదాయాలు.. ఒక్కటేమిటీ ప్రతిస్థలం వేదికగా మారింది. ఈ ఉద్విగ్న ఘడియల కోసం ప్రతి ఒక్కరూ 'జయహో భారత్' అని నినదించారు. భారత వైజ్ఞానిక సత్తా, ప్రదర్శించిన నైపుణ్యానికి ప్రతి ఒక్కరూ 'సాహో' అన్నారు. జాబిల్లి ఉపరితలాన్ని ముద్దాడిన విక్రం రోవర్‌ను అత్యంత పట్టుదలతో ఇప్పటివరకు సాంకేతిక తపన కనబరిచిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ను ప్రతి ఒక్కరూ వేనోళ్ల పొగిడారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ఇప్పటివరకు ఏ దేశం కాలుమోపని చరిత్ర ఉండగా ఆ ఘనత సాధించిన తొలిదేశంగా భారత్ నిలిచింది. బుధవారం సాయంత్రం 5.44 గంటలకు ల్యాండింగ్ ప్రక్రియ మొదలు కాగా 6.04 గంటలకు చంద్రయాన్–3 విక్రమ్ ల్యాండర్ చందమామను చేరుకుంది. అంతరిక్షంలో భారత ప్రతిష్టను చాటిచెప్పింది. ఇక నేటి నుంచి 14 రోజులపాటు జాబిల్లిపై రోవర్ పరిశోధనలు జరపనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు వర్గాల ప్రజలు చంద్రయాన్–3పై 'సాక్షి'తో పంచుకున్న అభిప్రాయాలు వారి మాటల్లోనే..

### భారత్ ప్రతిష్ట పెరిగింది



సాంకేతిక నైపుణ్యంతో చందమామ వద్దకు చేరుకునే స్థాయికి భారత్ చేరింది. ఇది ప్రపంచ దేశాల్లో మన దేశ ప్రతిష్టను పెంపొందించింది. చంద్రయాన్–3 ద్వారా అనేక అన్వేషణలకు బీజం పడింది. ఇది సాంకేతిక రంగంలో భారతదేశం చాటిన ఘనత, ఒక మైలురాయిగా నిలిచింది.
– రామకృష్ణ, ఫిజిక్స్ లెక్చరర్, నిర్మల్

### అగ్రగామిగా రుజువైంది



జాబిల్లిపైకి కొన్ని దేశాలు మాత్రమే రాకెట్లను పంపించాయి. ఈ దేశాల సరసన భారత్ నిలిచిన అద్భుత తరుణమిది. చంద్రయాన్–3 ల్యాండింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా చూసి తన్మయత్వాన్ని పొందాం. దీంతో సైన్స్ రంగంలో భారతదేశం అగ్రగామి అని రుజువైంది.
– ముత్యంరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్, కార్మికశాఖ

### అద్భుతఘట్టం ఆవిష్కారం



జాబిల్లిపై చంద్రయాన్–3 ల్యాండింగ్ విజయవంతం కావడంతో ప్రపంచ దేశాల్లో భారత్ ప్రతిష్ట మరింత ఇనుమడించింది. అద్భుతమైన ఘట్టం తీవ్ర ఉత్కంఠ మధ్య ఆవిష్కృతమైంది. ప్రక్రియను వీక్షించి సంతోషించాను. ఇస్రో మరిన్ని మైలురాళ్లను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నా.
– రాఘవేందర్, సైన్స్ టీచర్, నిర్మల్

### భారత్ సాంకేతికత అద్భుతం



శాస్త్రవేత్తల కృషి, భారత సాంకేతిక నైపుణ్యంతోనే ఇది సాధ్యమైంది. చంద్రయాన్–3 చివరి ఘట్టమైన ల్యాండింగ్ కళ్లారా వీక్షించి ప్రత్యేక అనుభూతిని పొందాం. చాలా గర్వంగా ఉంది. ఈ ఘట్టంతో భారత్ సాంకేతికతకు ఇక తిరుగులేదని నిరూపితమైంది.
– రాజేశ్వర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

### శాస్త్రవేత్తల కృషితోనే..



చంద్రయాన్–3 వ్యోమనౌక చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అయింది. ఇదంతా అంతరిక్ష శాస్త్రవేత్తల నైపుణ్యంతోనే సాధ్యమైంది. ల్యాండర్‌కు కృత్రిమమేధ, ప్రత్యేక సాఫ్ట్‌వేర్ శాస్త్రవేత్తలే తయారు చేశారని మా టీచర్లు వివరించారు. ప్రత్యక్ష ప్రసారాన్ని పెద్ద టీవీపై చూపించారు. చంద్రయాన్–3 సక్సెస్ కావడం గర్వంగా ఉంది. – మణిదీప్, విద్యార్థి, నిర్మల్

### ఆసక్తిగా తిలకించాం



ఇస్రో సంస్థ వారు ప్రయోగించిన చంద్రయాన్–3 చంద్రుడిపై ల్యాండ్ అయ్యే దృశ్యాలను మా పాఠశాల ఉపాధ్యాయులు డిజిటల్ తెరపై చూపించారు. ఆసక్తిగా చూస్తున్న సమయంలో సాఫీగా చంద్రుడిపై అడుగిడిన తర్వాత 'జయహో ఇస్రో.. జయహో భారత్.' అంటూ నినాదాలు చేశాం. పటాకులు పేల్చాం.
– హరిణి, విద్యార్థిని, నిర్మల్

### భారత్ కల సాకారమైంది



చంద్రయాన్–3 విజయవంతంగా ప్రయోగించాలన్న భారత్ కల సాకారమైంది. రెండుసార్లు విఫలమైనా మూడోసారి పట్టు వదలకుండా దాదాపు రూ.600 కోట్లతో చంద్రయాన్–3 ప్రయోగాన్ని ఉద్వేగ భరిత క్షణాల్లో విజయవంతం చేశారు. దీని గురించి మా ప్రిన్సిపాల్, ఫిజిక్స్ టీచర్ వివరించారు. – రామ్‌చరణ్, విద్యార్థి, నిర్మల్

### ట్రిపుల్‌ఐటీలో చంద్రయాన్–3 వీక్షణ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ ఆడిటోరియంలో చంద్రయాన్–3 చంద్రుడిపై ల్యాండ్ అయ్యే దృశ్యాలను విద్యార్థులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్‌పై చూశారు. చంద్రయాన్–3 విజయవంతం కావడంతో కేరింతలు కొట్టారు.

### చంద్రయాన్‌తో సరికొత్త చరిత్ర

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నిర్మల్: చందమామపై విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్ విజయవంతం కావడంతో భారత్ సరికొత్త చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖించిందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తంజేశారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలిదేశంగా భారత్ అవతరించిందని, ఇది మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో ప్రబల శక్తులుగా పేరున్న అమెరికా, చైనా, రష్యాకు కూడా సాధ్యం కాని ప్రయోగాన్ని విజయవంతం చేసి ప్రపంచానికే మార్గదర్శకంగా నిలిచిందని కొనియాడారు. యావత్ భారతావని ఆకాంక్షను నెరవేర్చిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఇందుకోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

### సరికొత్త అధ్యాయం



భారత అంతరిక్ష పరిశోధనలు సరికొత్త అధ్యాయం అని చెప్పవచ్చు. ప్రభుత్వ ప్రోత్సాహం, శాస్త్రవేత్తల నిరంతర కృషితో ఇది సాధ్యమైంది. దీని ద్వారా మరిన్ని సరికొత్త అన్వేషణలకు భారత్ శ్రీకారం చుడుతుంది. ప్రపంచ దేశాల్లో భారత్ సాంకేతిక స్థానం మరింత పదిలమైంది.
– గంద్రత్ శ్రీనివాస్, జూనియర్ సైంటిస్ట్

### కొత్త అనుభూతికి లోనయ్యాం



బడిలో డిజిటల్ తెరపై ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించాం. చూస్తున్నంత సేపు కొత్త అనుభూతికి లోనయ్యాం. చంద్రుడిపై రోవర్ ల్యాండ్ అయిందని తెలియగానే మేమంతా కేరింతలు కొట్టాం. 'జయహో భారత్' అని నినాదాలు చేశాం. గర్వంగా అనిపించింది. దీని గురించి మా సార్లు వివరించారు. – భవిత, విద్యార్థిని, పరిమండల్

### ప్రతిష్ట మరింత పెరిగింది



ప్రపంచ దేశాల్లో దేశ ప్రతిష్ట మరింత పెరిగింది. ప్రపంచానికి సంస్కృతీసంప్రదాయాలు తెలియజెప్పిన ఘనత మనదేశానికి ఉంది. సాంకేతిక నైపుణ్యంలోనూ ముందుందని ఈ అంతరిక్ష ప్రయోగం రుజువు చేసింది. చంద్రయాన్–3 ద్వారా శాస్త్రవేత్తల కృషి, పరిశోధన స్థాయి ప్రపంచానికి తెలిసింది.
– వెంకటేశ్, వ్యాపారి, నిర్మల్

## న్యూస్‌రీల్

### చిన్నారుల కోసం అంబులెన్స్ సర్వీస్



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి, కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: మాతాశిశు సంరక్షణే ధ్యేయంగా సర్కారు దవాఖానల్లో ప్రసవ సేవలు పొందేవారికి మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆస్పత్రిలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ.35 లక్షల వ్యయంతో చిన్నారుల కోసం నియో నేటల్ వైద్యసేవల కోసం అంబులెన్స్ కేటాయించామని చెప్పారు. దీనిలో ఇన్ క్యుబేటర్, వెంటిలేటర్లతో కూడిన సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పాల్గొన్నారు.

### పార్టీ విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేశ్‌పవార్

తానూరు: టికెట్ ఎవరికి వచ్చినా పార్టీ విజయానికి కృషి చేయాలని మహారాష్ట్రలోని నాయేగాం ఎమ్మెల్యే రాజేశ్‌పవార్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని కల్యాణ మండలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. అసెంబ్లీ యోజన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో పర్యటించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు సతీశ్‌రెడ్డి, సోమ్‌నాథ్, బాలాజీ, ఎల్లప్ప, లస్మారెడ్డి, రమేశ్‌పటేల్, గోపాల్‌స్వామి, చక్రధర్ పటేల్, గంగాధర్ పటేల్ పాల్గొన్నారు.

### కుభీర్ కళాశాల తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న పరశురామ్

కుభీర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో జాదవ్ పరశురాం బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల హాజరు చూసి సంతృప్తి వ్యక్తంజేశారు. గతేడాది సాధించిన ఎంసెట్ ర్యాంక్‌ల వివరాలు చూసి అధ్యాపకులను అభినందించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హన్మంత్‌రావు, అధ్యాపకులు సంపత్, భాస్కర్, నర్సయ్య, రమేశ్, లింగయ్య, శేఖర్, శ్రీనివాస్ ఉన్నారు.

### కలెక్టరేట్ ఎదుట ఆశ కార్యకర్తల ధర్నా



ధర్నా చేస్తున్న ఆశాకార్యకర్తలు

నిర్మల్‌చైన్‌గేట్: సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట బుధవారం ఆశ కార్యకర్తలు ధర్నా చేశారు. ముందుగా ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలకు రూ.18వేల వేతనం ఇచ్చేదాకా పోరాటం ఆపేది లేదని తెలిపారు. ఈ నెల 26న తహసీల్దార్ కార్యాలయం ఎదుట, 29న ఎమ్మెల్యే ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పీ గంగామణి మాట్లాడుతూ.. కరోనా కాలంలో ప్రజల ప్రాణాలు కాపాడిన మహిళా సైనికులు ఆశ కార్యకర్తలని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ చంద్రకళ, జిల్లా ఉపాధ్యక్షులు విజయ, ఇంద్రమాల, నంద, సుగుణ, జ్యోతి, సులోచన, భాగ్య, సుజాత, విజయ తదితరులున్నారు.

## దివ్యాంగులకు అండగా కేసీఆర్

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి
- దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



ఉపకరణాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: దివ్యాంగులకు సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, సమగ్ర శిక్ష, జిల్లా విద్యాశాఖ, ఆలింకో ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ చేపట్టగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగులైన చిన్నారులకు 154 వినికిడి యంత్రాలు, 46 చక్రాల కుర్చీలు, తొమ్మిది మూడు చక్రాల కుర్చీలు, 43 కృత్రిమ అవయవాలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. దివ్యాంగులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దన్నారు. ప్రతి ఒక్కరూ దివ్యాంగులకు అండగా నిలవాలని సూచించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో విలీన విద్యావిభాగంలో 18 ఐఆర్సీ కేంద్రాలు నిర్వహిస్తున్నామని, 31 మంది ఐఆర్పీలు పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లాలో 1,259 దివ్యాంగ విద్యార్థులను సర్వే ద్వారా గుర్తించామని పేర్కొన్నారు. విద్యార్థులకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ సేవలు కూడా అందిస్తున్నామని తెలిపారు. జాతీయ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా పారితోషికాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా విలీన విద్య సమన్వయకర్త ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థులకు ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్, స్టైఫండ్, రీడర్ అలవెన్స్ లాంటి ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, గతేడాది దాదాపు 560 మందికి పంపిణీ చేశామని తెలిపారు. డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రవీందర్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కౌన్సిలర్ సలీం, ఆలింకో సభ్యులు జోనాథన్, శుభంకర్, ప్రకాశ్, జిల్లా సంక్షేమాధికారి వైపీ రమేశ్, ఎంఈవో శంకర్, ఎస్టీఎఫ్ సెక్రటరీ రమణారావు, ఎస్సార్ జీ దయానంద్, ఐఆర్పీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- నిర్మల్, భైంసాలో ర్యాలీ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో కలెక్టర్‌తోపాటు ఎస్పీ ప్రవీణ్‌కుమార్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి మంచిర్యాల చౌరస్తా మీదుగా తిరిగి ఎన్టీఆర్ స్టేడియం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అక్టోబరు ఒకటి నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని సూచించారు. కళాశాలల యాజమాన్యాలు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై అవగాహన కల్పించారు. ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పీ సీఈవో సుధీర్, జిల్లా పౌరసంబంధాల అధికారి తిరుమల, డీఈవో రవీందర్, తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది, ఎంపీడీవోలు, ఎంపీవోలున్నారు.

భైంసారూరల్: అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ సూచించారు. బుధవారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు భైంసా పట్టణంలో 5కే రన్ నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం మీదుగా డీఎస్పీ కార్యాలయం, బస్టాండ్ ప్రాంతం నుంచి నిర్మల్ చౌరస్తావరకు ర్యాలీ కొనసాగింది. ఓటు నమోదు, ఓటు హక్కు, ఓటు విలువపై అవగాహన కల్పించారు. ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పట్టణ సీఐ శ్రీను, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లోకి బీజేపీ మండలాధ్యక్షుడు



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ప్రేమ్‌కుమార్

నిర్మల్: బీజేపీ సోన్ మండలాధ్యక్షుడు మ్యాక ప్రేమ్‌కుమార్ బుధవారం జిల్లాకేంద్రంలోని మంత్రి నివాసంలో మంత్రి ఐకేరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈమేరకు ప్రేమ్‌కుమార్‌కు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గులాబీ కండువా వేసి ఆహ్వానించారు. కేసీఆర్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. ప్రేమ్‌కుమార్‌తోపాటు వార్డ్‌మెంబర్లు గంట మహేందర్, శ్రీకాంత్, పెసరి దాము తదితరులు పార్టీలో చేరారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గణేశ్‌చక్రవర్తి, సోన్ జెడ్పీటీసీ సభ్యుడు జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు మారుగొండ రాము తదితరులున్నారు.

## జాన్సన్‌నాయక్‌కు ఘనస్వాగతం



జాన్సన్‌నాయక్‌ను గజమాలతో సత్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖానాపూర్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్ బుధవారం ఖానాపూర్‌కు రాగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మండలంలోని బాదనకుర్తి గ్రామంలో గల శివాలయంలో జాన్సన్‌నాయక్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనకు దారి పొడవునా మంగళహారతులు, గుస్సాడీ నృత్యాలు, డోలు వాయిద్యాల మధ్య బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. బాదనకుర్తి, సుర్జాపూర్, మస్కాపూర్ గ్రామాలతో పాటు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు కొనసాగింది. స్థానిక జగన్నాథ్‌రావు చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహానికి జాన్సన్‌నాయక్ పూలమాల వేశారు. ఈ సందర్భంగా అభిమానులు పలుచోట్ల క్రేన్‌ల సాయంతో గజమాలలు వేసి జాన్సన్‌ను సత్కరించారు. పటాకులు పేల్చి పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ దండె విఠల్, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు జాన్సన్‌ను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

**మొక్కు చెల్లించుకున్న అభిమానులు**

బీఆర్‌ఎస్ అధిష్టానం ఖానాపూర్ టికెట్ జాన్సన్ నాయక్‌కు కేటాయిస్తే అలిపిరి మెట్ల ద్వారా కాలినడకన తిరుమలకు వెళ్లి వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తామని మొక్కుకున్న ఆ పార్టీ నాయకులు బుధవారం మొక్కు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రత్యేక పూజలు చేస్తామని, సేవా కార్యక్రమాలు చేపడతామని, మరోసారి కాలినడకన వస్తామని స్వామివారికి మొక్కుకున్నట్లు తెలిపారు. పాత ఎల్లాపూర్ మాజీ ఉపసర్పంచ్ కొడిమ్యాల వీరేశ్, నాయకులు ఎరుకల వెంకటేశ్, చిగుర్ల రాజేశ్వర్, నాగుల గంగారాంగౌడ్ తదితరులున్నారు.

## అడెల్లి ఆలయానికి రూ.22.84లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

సారంగపూర్: అడెల్లి మహాపోచమ్మ ఆలయ పరిసరాల్లో వివిధ దుకాణ సముదాయాల కేటాయింపునకు బుధవారం ఆలయ ఈవో రవికిషన్‌గౌడ్, రెనోవేషన్ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. వేలం ద్వారా రూ.22.84లక్షల ఆదాయం సమకూరింది. కొబ్బరి కాయల విక్రయం, టెంట్ సామగ్రి అద్దెకు ఇవ్వడం, ఇడుపుడు పిల్లలు తిప్పు హక్కుల కోసం ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో తాత్కాలికంగా వాటి వేలం నిలిపివేసినట్లు ఈవో తెలిపారు. కాగా, ప్యాలాలు, పుట్నాలు విక్రయించుకునే హక్కునకు గతేడాది రూ.1.50లక్షలు రాగా.. ఈసారి రూ.1.55లక్షలు, క్యాసెట్లు, బొమ్మలు విక్రయించుకునే హక్కునకు గతేడాది రూ.2.70లక్షలు రాగా.. ఈసారి రూ.3.20 లక్షలు, ఇతర హక్కుల ద్వారా గతేడాది రూ.4.55లక్షలు రాగా.. ఈ ఏడాది రూ.4.56లక్షలు, టోల్ టాక్స్ వసూలుకు గతేడాది రూ.9లక్షలు రాగా.. ఈసారి రూ.9.2లక్షలు, పూలదండలు విక్రయించుకునే హక్కునకు గతేడాది రూ.4.10లక్షలు రాగా.. ఈ ఏడాది రూ.4.16లక్షలు వచ్చాయి. కొబ్బరి ముక్కలు సేకరించుకునే హక్కును రూ.35వేలకు వ్యాపారులు దక్కించుకున్నారు. త్వరలో నిలిచిన మూడు హక్కులకు వేలం నిర్వహించే తేదీలు ఖరారు చేస్తామని ఈవో తెలిపారు. కార్యక్రమంలో వేలం పర్యవేక్షణాధికారి రాజమౌళి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ సుచరిత, సీనియర్ అసిస్టెంట్ రమణారావు, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ మాధవరావు, నాయకులు పతాని భూమేశ్, దోనిగాం రాజు, లక్ష్మీనారాయణగౌడ్ తదితరులున్నారు.

## అధికారంలోకి వస్తే ఇంటికి రెండు పెన్షన్లు

- అర్హులందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు
- బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్
- జిల్లా కేంద్రంలో భారీగా చేరికలు



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ అధికారంలోకి వస్తే ఇంటికి రెండు పెన్షన్లు ఇస్తామని పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్ బుధవారం జిల్లా కేంద్రంలోని మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఈటల సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఈటల ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అంతకుముందు అయ్యన్నగారి రాజేందర్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి అధికసంఖ్యలో కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహేశ్వర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు సీఎం కేసీఆర్‌కు ఓటమి రుచి చూపించి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కేసీఆర్ హయాంలో యువత గంజాయికి బానిసై చిన్న వయసులోనే ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో గిరిజనులు, దళితులపై దాడులు పెరిగిపోయాయని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాకపోతే పింఛన్ తొలగిస్తామని బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఆనాటి ఎన్టీఆర్ ప్రభుత్వం నుంచి ఈనాటి కేసీఆర్ ప్రభుత్వం దాకా రేషన్ విధానం అలాగే కొనసాగిందని, ఏ ప్రభుత్వం వచ్చినా ఈ పథకాన్ని తొలగించలేకపోయారని పేర్కొన్నారు. ఒక ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాన్ని ఇంకో ప్రభుత్వం వస్తే తొలగించడం అసాధ్యమని తెలిపారు. రైతులకు రైతుబంధు అందజేసి మిగతా స్కీములకు దూరం చేశారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో సారా పోయి లిక్కర్ ఏరులై పారుతోందని, ప్రతీ గల్లీకో బెల్ట్‌షాపు ఏర్పడిందని విమర్శించారు.

### ట్రిపుల్‌ఐటీకి బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

భైంసా: నిజామాబాద్ బస్టాండ్‌లో బాసర ట్రిపుల్ ఐటీ వరకు నడిపే బస్సును బుధవారం ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ, ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ప్రారంభించారు. నిత్యం ఉదయం 8కి నిజామాబాద్ నుంచి బయలుదేరి 9గంటల వరకు ట్రిపుల్‌ఐటీకి చేరుకుంటుందని ఆర్టీసీ ఆర్‌ఎం జానీరెడ్డి తెలిపారు. బాసర ట్రిపుల్‌ఐటీ సిబ్బంది, ఉద్యోగుల సౌకర్యార్థం బస్సును ప్రారంభించినట్లు తెలిపారు.

## క్లుప్తంగా

### గుడుంబా స్థావరాలపై దాడులు


బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారి

ఖానాపూర్: పట్టణంలోని సుభాష్‌నగర్, గాంధీనగర్ కాలనీల్లో ఎక్సైజ్ ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతో పాటు గుడుంబా విక్రయిస్తూ పట్టుబడిన లక్ష్మి, పద్మ, ఆశవ్వలపై కేసు నమోదు చేయడంతో పాటు డిప్యూటీ తహసీల్దార్ మంజుల వద్ద బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో సిబ్బంది ముత్యం, గౌతం, భాస్కర్, రవీందర్, కల్పన తదితరులు ఉన్నారు.

### సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు


సీఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఏఐసీసీ సభ్యురాలు గంద్రత్ సుజాతకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో పోస్టుచేసిన వివరాలను సీఐ సత్యనారాయణకు వివరించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకుడు రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి సుజాతపై లేనిపోని ఆరోపణలు గుప్పిస్తూ పోస్టు చేశాడని, అతడిపై కేసు నమోదు చేయాలని, లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాజేశ్వర్, సారంగారావు, గంగన్న, ప్రభాకర్ రెడ్డి, నాందేవ్, మధుకర్, వినోద్, సంతోష్, రాకేష్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో గర్భిణి మృతి


శివలింగు శ్రీజ (ఫైల్)

నిర్మల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో మూడు నెలల గర్భిణి మృత్యువాత పడిన సంఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన శివలింగు శ్రీజ(32) సోఫీనగర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తోంది. మధ్యాహ్నం ఆమె విధులు ముగించుకుని భర్త వీరేన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా.. ఈదుగాం లోని గోల్డెన్ ఫంక్షన్‌హాల్ వద్ద వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీజ బైక్‌పై నుంచి ఎగిరి రోడ్డుపై పడగా తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. కాగా శ్రీజకు ఓ కుమార్తె (5) ఉండగా, ప్రస్తుతం మూడు నెలల గర్భిణి. కాలేజీకి వెళ్తానని చెప్పి శ్రీజ శవమై ఇంటికి రావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై రాజేశ్వర్ గౌడ్ తెలిపారు.



# సృజనాత్మకతకు 'ఇన్‌స్పైర్ మానక్'

- 31వరకు నామినేషన్ల స్వీకరణ
- ఎంపికైన ప్రాజెక్ట్‌కు రూ.10వేలు


ప్రాజెక్ట్‌తో విద్యార్థులు (ఫైల్)

మామడ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను వెలికితీసేందుకు ఇన్‌స్పైర్ మానక్ దోహదం చేస్తోంది. ఇందులో విద్యార్థి ప్రాజెక్ట్ ఎంపికైతే ప్రభుత్వం రూ.10వేలు అందిస్తోంది. ఈ మొత్తంలోంచి ప్రాజెక్ట్ తయారీకి రూ.5వేలు, విద్యార్థి రవాణా ఖర్చులకు రూ.5వేలు వినియోగించుకోవాలి. ఆగస్టు 31 వరకు ఇన్‌స్పైర్ అవార్డులకు దరఖాస్తు గడువు ఉంది. గతేడాది జిల్లాలో 1,222 నామినేషన్లు రాగా, 118ని జిల్లా స్థాయిలో ఎంపిక చేశారు.

**ఆన్‌లైన్‌లో నమోదు ఇలా....**

ఇన్‌స్పైర్ (ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్ రీసర్చ్), మానక్ (మిలియన్ మైండ్స్ అగుమెంటింగ్ నేషనల్ అస్పిరేషన్ అండ్ నాలెడ్జ్), ఇన్‌స్పైర్ మానక్ దరఖాస్తులను అంతర్జాలంలో నమోదు చేసేందుకు మార్గదర్శకాలను విద్యాశాఖ అధికారులు అందజేశారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు అర్హులే. ప్రాథమికోన్నత స్థాయిలో ఇద్దరు, ఉన్నత పాఠశాలల నుంచి 5 మంది విద్యార్థులు పాల్గొనవచ్చు. www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లిన అనంతరం మొదట పాఠశాల రిజిస్ట్రేషన్‌ను చేయించుకోవాలి. ఈ ఏడాది నుంచి మరింత సులభంగా మొబైల్ యాప్ ద్వారా కూడా వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. స్కూల్ అథారిటీలోకి లాగిన్ అయితే ఫర్ వన్‌టైమ్ రిజిస్ట్రేషన్‌లో పాఠశాల వివరాలు నమోదు చేయాలి. విద్యార్థి బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్‌కార్డు వివరాలు, ప్రాజెక్ట్ వివరాలు, విద్యార్థి ఫొటో అప్‌లోడ్ చేసి జిల్లా అథారిటీ ఆన్‌లైన్‌లో పంపించాలి. పంపించిన అనంతరం అక్‌నాలెడ్జ్‌మెంట్ వస్తుంది.

**ఎంపిక చేస్తారు ఇలా....**

అంతర్జాలంలో నమోదు చేసుకున్న విద్యార్థుల నమూనాలను జాతీయ పరిశోధన సంస్థ పరిశీలించి ఎంపిక చేస్తుంది. ఇందులో లక్ష ఆలోచనల జాబితాను సిద్ధం చేస్తారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు రూ.10వేల వంతున వారి సొంత బ్యాంకు ఖాతాలోకి అందిస్తారు. ఈ డబ్బులతో పరిశోధనలకు అవసరమైన పరికరాలు సామగ్రిని కొనుగోలు చేయవచ్చు. విద్యార్థులు ముందుగా తమ ప్రదర్శనను జిల్లా స్థాయిలో ప్రదర్శించాలి. దేశవ్యాప్తంగా 10వేల మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన వెయ్యిమందిని జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తారు. జాతీయ స్థాయిలో ఉత్తమమైన 60 ప్రదర్శనలను ఎంపిక చేసి వీటిని ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రిన్యూర్‌షిప్ ఉత్సవాలలో ప్రదర్శిస్తారు. జాతీయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఏటా ఉపకార వేతనాలను అందిస్తారు. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డులకు అర్హులు. విద్యార్థులు తమ చుట్టూ ఉన్న సాధారణ సమస్యలను చూసి వాటికి పరిష్కారం ఆవిష్కరణలు చేసే విధంగా వారిని ఉపాధ్యాయులు ప్రోత్సాహించాలి.

**విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపికైతే ప్రయోజనాలు...**

1.ఉన్నత చదువులకు ఉపకార వేతనాలను వినియోగించుకోవచ్చు.
2. ఐఐటీ ఢిల్లీ కళాశాలలో ప్రవేశానికి అదనపు పాయింట్స్ కేటాయిస్తారు.
3. భారత రాష్ట్రపతిని కలిసే అవకాశం ఉంటుంది.
4.ప్రాజెక్ట్ పేటెంట్ హక్కును పొందే అవకాశం కల్పిస్తారు.

**ప్రతీ పాఠశాల నుంచి నామినేషన్లు వేయించాలి**



ప్రతీ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 నామి నేషన్‌లు, ఉన్నత పాఠశాలల నుండి 5 నామినేషన్‌లు వచ్చే విధంగా సంబంధిత ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలతో ప్రాజెక్టును రూపొందించే విధంగా ఉపాధ్యాయులు ప్రోత్సాహించాలి. – రవీందర్‌రెడ్డి, నిర్మల్ జిల్లా విద్యాశాఖాధికారి

**ఇన్‌స్పైర్ యాప్‌లో వివరాలు నమోదు**



మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్పైర్ యాప్ ద్వారా నామినేషన్‌లు వేయించొచ్చు. ఈ నెల 31 వరకు పాఠశాలల విద్యార్థుల ప్రాజెక్ట్‌ల వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. గడువు చివరన ఆన్‌లైన్ బిజీ వంటి సమస్యలు ఉంటాయి. చివరి తేది వరకు వేచి చూడకుండా ఇప్పటి నుంచి వివరాలు నమోదు చేయించాలి.
– వినోద్‌కుమార్, నిర్మల్ జిల్లా సైన్స్ అధికారి

### యాపల్‌గూడలో వైద్యబృందం పరిశీలన


ప్రజలతో మాట్లాడుతున్న వైద్య అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: సీనియర్ రీజినల్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారి డాక్టర్ అనురాధ, రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ లెప్రాసి, టీబీ అధికారి డాక్టర్ జాన్ బాబుతో పాటు పలువురు అధికారులు బుధవారం మండలంలోని యాపల్‌గూడ గ్రామాన్ని సందర్శించారు. ఈ నెల 15 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న లెప్రాసి పక్షోత్సవాల్లో భాగంగా గ్రామాన్ని సందర్శించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే గ్రామంలోని హెల్త్ సబ్ సెంటర్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. సబ్ సెంటర్‌కు వస్తున్న రోగులకు, గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గ్రామంలో మచ్చలు కలిగిన వ్యక్తులను ఇంటింటికి తిరుగుతూ పరిశీలించారు. ఎవరికైనా ఎలాంటి మచ్చలు ఉన్న వారిని గుర్తించి వైద్యులకు చూపించాలని గ్రామంలోని ఆశా, ఏఎన్‌ఎంలకు సూచించారు. గ్రామంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమం ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. గ్రామాన్ని సందర్శించిన వారిలో జిల్లా లెప్రాసి అధికారి డాక్టర్ శ్రీకాంత్, మండల వైద్యాధికారి డాక్టర్ రాహుల్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్లు వామన్‌రావ్, మధు సూదన్, ఎల్‌టీ రమణ, హెల్త్ సూపర్ వైజర్స్ బొమ్మత సుభాష్, ఆడే సురేష్, కొడప యశోద, ఆరోగ్య కార్యకర్త శ్రీదేవి ఉన్నారు.

# తప్పుడు ప్రచారం మానుకోవాలి

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్


మాట్లాడుతున్న బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు తనపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌లో పలువురు చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గ్రామగ్రామానా బలోపేతం అవుతున్న తరుణంలో బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు కలిసి కుట్రపూరితంగా తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే భర్త శ్యామ్ నాయక్ పార్టీలో చేరిన వార్త అందరికీ తెలిసిందేనని, ఎమ్మెల్యే రేఖానాయక్ త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వివిధ మీడియాల్లో వార్తలు రావడంతో ఆమె డబ్బులకు వెడ్మ బొజ్జు పటేల్ అమ్ముడుపోయాడని దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని అన్నారు. రాజకీయంగా తనను దెబ్బతీసేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాను ఆత్మగౌరవంతో బతికే వ్యక్తినని అన్నారు. ప్రజాసేవకే రాజకీయాల్లో చేరినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ తనకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి న్యాయం చేస్తుందని స్పష్టం చేశారు. ఎవరైనా తనపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ ఖయ్యూం, జహీర్, సర్పంచ్ మెస్రం రేణుకనాగ్‌నాథ్, సోమసే వెంకట్‌రావ్, సోన్‌కాంబ్లే జీతెందర్, ఆత్రం కళ్యాణ్, ఆత్రం రాహుల్ ఉన్నారు.

# ప్రాణం తీసిన స్పోర్ట్స్ బైక్

- అతివేగంగా ఢీకొట్టడంతో ఒకరి మృతి
- మృతుడి కళ్లు దానం చేసిన కుటుంబీకులు


నర్సయ్య (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: జీవితాంతం తోడుంటానని తనతో ఏడడుగులు నడిచిన భర్త కళ్లెదుటే రోడ్డు ప్రమాదంలో మరణించడాన్ని ఆయన భార్య జీర్ణించుకోలేక పోతోంది. దంపతులిద్దరూ కలిసి ప్రతిరోజు పనుల నిమిత్తం తమ గ్రామం మావల నుంచి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తున్నారు. ఓరగంటి నర్సయ్య (40) జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అలాగే అతడి భార్య ప్రతిమ బస్టాండ్ ఎదుట కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. రోజు లాగే విధులు ముగించుకుని బస్టాండ్ ప్రాంతానికి కాలిబాటన నర్సయ్య రోడ్డుకు అటువైపు ఉన్న భార్యను తీసుకొని వెళ్లేందుకు రోడ్డు దాటే క్రమంలో ఓ యువకుడు బైక్‌పై అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతిచెందాడు. ప్రమాదానికి కారకుడైన యువకుడు సంఘటనా స్థలం నుంచి బైక్‌తో పాటు పరారయ్యాడు. బైక్ నంబర్‌తో చూడగా భుక్తాపూర్ కాలనీకి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా తీవ్ర విషాదంలో ఉన్న ఆ కుటుంబం మరొకరి జీవితంలో వెలుగు నింపేలా నిర్ణయం తీసుకుంది. మృతిచెందిన నర్సయ్య కళ్లను ఇతరులకు దానం చేసి వారికి కొత్త జీవితం ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఈ కుటుంబం తీసుకున్న నిర్ణయాన్ని పలువురు ప్రశంసించారు.

**అసలేం జరిగిందంటే..**

అటవీశాఖ కార్యాలయంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న నర్సయ్యది పేద కుటుంబం. తండ్రి ఇదివరకే మరణించగా, వృద్ధురాలైన తల్లి సుభద్ర ఇంటివద్దే ఉంటుంది. నర్సయ్యకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె అశ్విత పదో తరగతి చదువుతుండగా, రెండో కుమార్తె అంకిత 8వ, మూడో కుమార్తె ఆర్వి 5వ తరగతి చదువుతున్నారు. కుటుంబాన్ని పోషించేందుకు భార్య ప్రతిమ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట కూరగాయల వ్యాపారం చేస్తూ కుటుంబానికి అండగా నిలుస్తోంది. ప్రతిరోజు వీరు ఉదయం మావల గ్రామం నుంచి ఆదిలాబాద్ పట్టణానికి వస్తారు. మళ్లీ సాయంత్రం ఇద్దరు కలిసి ఇంటికి పయనం అవుతారు. ఇదే క్రమంలో మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో బస్టాండ్ ఎదుట రోడ్డు దాటుతున్న నర్సయ్యను ఢీకొట్టడంతో ఆయన తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు రాత్రి 10.30 గంటల సమయంలో హైదరాబాద్‌కు తరలించారు. అర్ధరాత్రి 2.30 గంటల ప్రాంతంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం అక్కడినుంచి మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆయన కళ్లను దానం చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ ఎస్సై డి.ఉదయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బావిలోపడి యువకుడి మృతి

ఇచ్చోడ: మండలంలోని గేర్జం గ్రామానికి చెందిన చిలకల స్వరూప్(28) బుధవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... స్వరూప్ ఉదయం తన వ్యవసాయ పొలంలో పురుగుల మందు పిచికారీ చేస్తుండగా నీళ్ల కోసం బావివద్దకు వెళ్లాడు. కాలుజారి ప్రమాదవశాత్తు బావిలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

### వన్యప్రాణిని వేటాడిన వ్యక్తిపై కేసు

పెంచికల్‌పేట్(సిర్పూర్): వన్యప్రాణిని వేటాడిన మండలంలోని అగర్‌గూడకు చెందిన చౌదరి సాయికృష్ణపై బుధవారం కేసు నమోదు చేసినట్లు పెంచికల్‌పేట్ రేంజ్ అధికారి వేణుగోపాల్ తెలిపారు. గ్రామానికి చెందిన సాయికృష్ణ అగర్‌గూడ అటవీప్రాంతంలో తన పంట చేను సమీపంలో వన్య ప్రాణులను వేటాడటానికి అమర్చిన ఉచ్చులోపడి కొండగొర్రె మృతి చెందింది. తమకు అందిన పక్కా సమాచారంతో అటవీశాఖ సిబ్బంది దాడులు నిర్వహించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం కేసు నమోదు చేశారు.

### జ్వరంతో వలస కూలీ మృతి

చెన్నూర్: ఉత్తరప్రదేశ్‌లోని లక్నో జిల్లా గొండిగామ్ గ్రామానికి చెందిన మహ్మద్ ఆలం కొంతకాలంగా స్థానిక సలీం వెల్డింగ్ షాపులో కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య షాబానా (25) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. బుధవారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతదేహాన్ని స్వగ్రామం తరలించేందుకు వాహనానికి రూ.80 వేలు అవుతోంది. అతని వద్ద ఆర్థికస్థోమత లేకపోవడంతో విషయం తెలిసిన కొందరు దాతలు స్పందించి మానవత్వం చాటుకున్నారు.

### పీజీ సెట్‌లో జిల్లా విద్యార్థి ప్రతిభ


కళ్లెం వెన్నెల రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల వెల్లడైన టీఎస్ పీజీ సెట్‌లో జిల్లా విద్యార్థిని కళ్లెం వెన్నెల రెడ్డి ప్రతిభ కనబర్చింది. ఇచ్చోడ మండలంలోని అడిగామ(కె)కు చెందిన కళ్లెం ప్రవీణ్‌రెడ్డి కూతురు వెన్నెల రెడ్డి పీజీ ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో రాష్ట్రస్థాయిలో 18వ ర్యాంక్ సాధించింది. అదేవిధంగా ఎంఏ ఎకనామిక్స్‌లో 29వ ర్యాంక్ దక్కించుకుంది. ఆమెకు ర్యాంక్ రావడంపై పలువురు అభినందనలు తెలియజేశారు.

### విద్యార్థిని ఆత్మహత్యాయత్నం..?

- పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినుల సస్పెన్షన్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సీబీఎస్‌ఈ సెలబస్ బోధించే ఓ పాఠశాలలో వారం క్రితం ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ఉపాధ్యాయులు వేధింపుల కారణంగా ఓ విద్యార్థిని బ్లేడ్‌తో చేతిని కోసుకోగా, ఆ విద్యార్థినికి మరో విద్యార్థి సహకరించిందనే సాకుతో ఐదు రోజుల పాటు పాఠశాల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కకుండా పాఠశాల యాజమాన్యం గోప్యతను పాటిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడలేదని, ఓ సంఘటన చోటుచేసుకోవడంతో ఐదు రోజుల పాటు ఇంట్లో కూర్చోబెట్టి చదివించాలని ఆమె తల్లిదండ్రులకు సూచించామని వివరించారు. వారి మానసికస్థితి సరైన తర్వాత పాఠశాలకు రావాలని సూచించినట్లు పేర్కొన్నారు.

### కాలువలో పడి యువకుడి మృతి


శ్రీనివాస్ మృతదేహం

మామడ: మండలంలోని దిమ్మదుర్తి గ్రామానికి చెందిన యువకుడు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు సరస్వతీ కాలువలో పడి మృతి చెందాడు. ఎస్సై రాజు వివరాల ప్రకారం... గోవు శ్రీనివాస్(27) దిమ్మదుర్తి గ్రామం సమీపంలోని సరస్వతీ కాలువకు మంగళవారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశత్తు కాలువలో పడి మృతి చెందాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా కాలువలో శవమై కనిపించాడు. పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. శ్రీనివాస్ తల్లి గోపురత్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


సంఘటన స్థలంలో క్షతగాత్రుడు నవీన్

తానూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ప్రయాణికుల వివరాల ప్రకారం... కుభీర్ మండలం రంజిని గ్రామానికి చెందిన తేకుల నవీన్, బొమ్మిడివార్ యోగేష్‌లు బుధవారం తానూరు మండలం కోలూరు గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికులు క్షతగాత్రులను భైంసా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ జిల్లాలోని ఆస్పత్రికి తరలించారు.

# మాజీ ఎంపీ నగేశ్‌ను కలిసిన అనిల్‌జాదవ్


మాజీ ఎంపీ నగేశ్‌ను సన్మానిస్తున్న అనిల్‌జాదవ్

ఇచ్చోడ: బీఆర్‌ఎస్ బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ బుధవారం హైదరాబాద్‌లోని మాజీ ఎంపీ గోడం నగేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో తన గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండి గెలుపు కోసం కృషి చేస్తానని నగేశ్ హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే బోథ్ నుంచి టికెట్ ఆశించిన వారిలో గోడం నగేష్ కూడా ఉన్నారు. కానీ చివరి నిమిషంలో అనిల్‌జాదవ్‌కు టికెట్ కేటాయిస్తూ సీఎం కేసీఆర్ తెలంగాణ భవన్‌లో ప్రకటించారు. దీంతో టికెట్ ఆశించిన మాజీ ఎంపీ గోడం నగేష్, సిట్టింగ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావులు కొంత అసంతృప్తికి గురయ్యారు. టికెట్ ఆశించిన ఇద్దరు కూడా ఇతర పార్టీలో చేరుతారనే ప్రచారం సాగింది. కానీ అనిల్ జాదవ్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావును, మాజీ ఎంపీ గోడం నగేష్‌ను కలిసి తన గెలుపునకు కృషి చేయాలని కోరడంతో బీఆర్‌ఎస్ పార్టీలో సెకండ్ క్యాడర్‌లోని అయోమయాన్ని తగ్గించింది.

### పరీక్ష ఒకటి.. పేపర్ మరొకటి

- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్య విధానం ఎస్‌డీఎల్‌సీఈ పరీక్షలు కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన ఓ పరీక్షలో విచిత్రం చోటు చేసుకుంది. విద్యార్థులు రాయాల్సిన పరీక్షకు బదులు మరో పరీక్ష పత్రాన్ని అందించారు. తర్వాత విద్యార్థులు తాము రాసే పరీక్షకు ఈ ప్రశ్న పత్రంతో సంబంధం లేదని గుర్తించారు. ఈ విషయాన్ని లెక్చరర్ల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు తర్వాత విద్యార్థులకు సంబంధిత పరీక్ష పత్రాన్ని అందించి పరీక్ష రాయించారు. పరీక్ష సమయం ముగిసిన తర్వాత అదనంగా కొంత సమయం కేటాయించి పరీక్ష రాయించారు. ఈ విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. బుధవారం ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. విద్యార్థులు చర్చించుకోవడంతో బండారం బయటపడింది. తెలంగాణ హిస్టరీకి బదులు ఇండియన్ హిస్టరీ పేపర్‌ను విద్యార్థులకు ఇచ్చారు. ఈ విషయమై కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్‌ను వివరణ కోరగా హిస్టరీలో మూడు విభాగాలు ఉంటాయని, ఇందులో ఏ విభాగం రాసినా ఇబ్బంది లేదని తెలిపారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు.

# అర్జుని మారుగూడకు వెళ్లాలంటే వాగు దాటాల్సిందే!


ఆశ కార్యకర్త సాయంతో వాగు దాటుతున్న రీజినల్ డైరెక్టర్ అనురాధ మోడోజు, వైద్య సిబ్బంది

- జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సీనియర్ రీజినల్ డైరెక్టర్‌కూ తప్పని తిప్పలు
- గిరిజన గ్రామంలో కాలినడకన పర్యటన.. లెప్రసీ సర్వే పరిశీలన

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం అర్జుని గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సీనియర్ రీజినల్ డైరెక్టర్ అనురాధ మోడోజు బుధవారం భారీ వర్షంలోనూ కాలినడకన పర్యటించారు. ఇటీవల కురుస్తున్న వర్షానికి గ్రామానికి వెళ్లే క్రమంలో ఉన్న వాగులో వరద పెరిగింది. రాకపోకలు కూడా నిలిచిపోయాయి. అయినా రీజినల్ డైరెక్టర్ కచ్చితంగా గ్రామాన్ని సందర్శించి కుష్ఠు గుర్తింపు సర్వే పరిశీలించాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో స్థానిక వైద్యులు, ఆశాకార్యకర్త సాయంతో మోకాళ్ల లోతు నీళ్లలో వాగు దాటి ఆమె గ్రామాన్ని సందర్శించారు. సర్వే తీరును పరిశీలించి పకడ్బందీగా చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే గిరిజనుల పరిస్థితిని చూసి చలించిపోయారు. బలహీనంగా ఉన్న చిన్నారులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి గిరిజనుల పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆమె వెంట టీబీ కంట్రోల్ అధికారి శ్రీకాంత్, డీపీఎంవో మధుసూదన్, వామన్‌రావు, హెచ్‌ఈ రవీందర్, హెచ్‌ఎస్ సంజయ్, ఆశ కార్యకర్త సురేఖ ఉన్నారు.

# 'కడెం'ను పరిశీలించిన నిపుణుల బృందం


వరదగేట్లను పరిశీలిస్తున్న నిపుణుల బృందం సభ్యులు

కడెం: కడెం ప్రాజెక్ట్‌ను బుధవారం చీఫ్ ఇంజినీరింగ్ సెంట్రల్ డివిజన్ ఆర్గనైజేషన్ (సీఈసీడీవో) హైదరాబాద్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) నిపుణుల బృందం సందర్శించింది. డ్యాం సేఫ్టీ రివ్యూ ప్యానల్ (డీఎస్ఆర్‌పీ) ప్రాజెక్ట్ ఆధునీకరించేందుకు సూచించిన అంశాల సాధ్యాసాధ్యాలను బృందం సభ్యులు పరిశీలించారు. పరిశీలించిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఔట్‌ఫ్లో సామర్థ్యం మరో 2 లక్షల క్యూసెక్కుల మేర పెంచేందుకు ప్రాజెక్ట్‌కు అదనపు గేట్లు ఏర్పాటు చేయాలని, ఇన్‌ఫ్లోను తట్టుకునేలా జర్మన్ గేట్ల ఎత్తు పెంచాలని, ప్రాజెక్ట్‌ను అలాగే ఉంచి దాని ముందే నూతన ప్రాజెక్ట్‌ను నిర్మించాలని డీసీఆర్‌బీ సూచించినట్లు అధికారులు తెలిపారు. సీఈ శ్రీనివాస్, ఎస్ఈ సుశీల్‌కుమార్, ఓఅండ్ఎంటీఎం ఎస్ఈ సంజీవ్, ఈఈ మురళీకృష్ణ, దేవానంద్, ఏఈ సంగీత్, ఈఈ విఠల్, డీఈ భోజదాసు, ఏఈఈలు రవికుమార్, సర్వరొద్దీన్, గణేశ్ తదితరులున్నారు.